క్లుప్తంగా

ప్రారంభానికి సిద్ధంగా తోటాడ సచివాలయం



నిర్మాణం పూర్తయిన తోటాడ సచివాలయం

మునగపాక : మండలంలోని తోటాడ సచివాలయం ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా రూ.48 లక్షల వ్యయంతో సచివాలయాన్ని నిర్మించారు. ఎంతో సుందరంగా సచివాలయాన్ని తీర్చిదిద్దారు. త్వరలో సచివాలయాన్ని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు చేతుల మీదుగా ప్రారంభించేందుకు అవసరమయ్యే ఏర్పాట్లు చేస్తున్నామని సర్పంచ్ దొడ్డి మంగవేణి తెలిపారు.

ఆలయ నిర్మాణంపై నేడు సమావేశం

మునగపాక: మండల కేంద్రంలో వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి ఆదివారం మునగపాక పంచాయతీ కార్యాలయం వద్ద అఖిలపక్ష సమావేశం జరుగుతుందని సర్పంచ్ దిమ్మల అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని అన్ని కులాలు,పెద్దలతో ఉదయం 9గంటలకు సమావేశం జరుగుతుందన్నారు. మునగపాక ఇందిరమ్మ కాలనీ, బీసీ కాలనీ, వాడ్రాపల్లికి వెళ్లే దారిలోని దేవదాయ శాఖకు సంబంధించిన స్థలాలను పరిశీలించి ఆలయ నిర్మాణానికి అందరి ఆమోదంతో ఒక నిర్ణయం తీసుకుంటారన్నారు. ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు, ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ అతిథులుగా హాజరయ్యే సమావేశాన్ని విజయవంతం చేయాలని అప్పారావు కోరారు.

నేడు సచివాలయాలు తెరిచే ఉంటాయి..

కోటవురట్ల : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం కూడా సచివాలయాలు తెరుచుకుంటాయని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని సచివాలయాలను తెరవాలని కార్యదర్శులకు ఆదేశాలిచ్చినట్టు తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తెరిచి ఉంటాయని, ఎక్కడైనా తెరవకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సచివాలయ సిబ్బంది ఎన్నికల నియమావళి సక్రమంగా అమలయ్యేలా పర్యవేక్షించాలన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టడం, ఎన్నికల ప్రచారం ఎక్కడ జరిగినా చర్యలు తీసుకుంటామన్నారు.

చిక్కాల రామారావుకు అభినందనలు



చిక్కాల రామారావును అభినందిస్తున్న నాయకులు

పాయకరావుపేట : ఉమ్మడి జిల్లాల వ్యవసాయ సలహా మండలి చైర్మన్, విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు అయిన చిక్కాల రామారావును పలువురు నాయకులు అభినందిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ అధిష్టానం చిక్కాల రామారావును ఉత్తరాంధ్ర జిల్లాలకు రైతు విభాగం ఇన్‌ఛార్జ్‌గా పదవి కల్పించింది. దీంతో చిక్కాల రామారావును మండలంలో గల పార్టీ నాయకులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు రామారావును కలిసి పుష్పగుచ్ఛాలు, సాలువాలు వేసి ఘనంగా సన్మానిస్తున్నారు.

నులి పురుగుల మాత్రలు వేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాసాచార్యులు

రాంబిల్లి : నులి పురుగుల నివారణ మాత్రలను విద్యార్థులంతా తప్పనిసరిగా వేసుకోవాలని దిమిలి పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాసాచార్యులు సూచించారు. దిమిలి ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం ఆయన నులి పురుగుల నివారణ మాత్రలు వేసుకోవడం ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రసాదరావు, హెల్త్ సూపర్‌వైజర్లు చిట్టిబాబు, ఈశ్వరి, ఏఎన్‌ఎం చినమ్మలు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



మామిడివాడలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



మునగపాక హైస్కూల్లోని ఎమ్మెల్సీ ఎన్నికల కేంద్రం



మెలిపాకలో ప్రచారం చేస్తున్న సచివాలయ కన్వీనర్ అప్పారావు



పోలింగ్ కేంద్రంలోని వసతులను పరిశీలిస్తున్న దృశ్యం



ఉపాధ్యాయులను ఓటు అభ్యర్థిస్తున్న వీసం

పాయకరావుపేట : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రంతో ముగిసింది. 13 వ తేదీన (సోమవారం) ఎన్నికలు కాగా నాయకులు శనివారం సాయంత్రంతో ప్రచారం ముగించారు. మండలంలో గల 24 గ్రామాల్లో పట్టభద్రులను, నాయకులు స్వయంగా కలిసి వైఎస్సార్‌సీపీ బలపర్చిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు హక్కు కల్పించాలని ఓటర్లను కోరుతున్నారు. పట్టణంలో గల 20 వార్డుల్లోను పట్టభద్రులను, మండలంలో గల ఆయా గ్రామాల్లో పట్టభద్రులను, ఆయా గ్రామాల పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు గ్రామ శాఖ అధ్యక్షులు సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజార్టీతో ఓట్లు వేసి గెలిపించాలని కోరుతున్నారు.

సుధాకర్ గెలుపు ద్వారా ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధ్యం

మునగపాక : ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ప్రచారం శనివారం సాయంత్రంతో ముగిసింది. పది రోజులుగా ఎన్నికల ప్రచారం జోరుగా సాగంది. వైఎస్సార్‌సీపీ మద్దతు ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ విజయం కోరుతూ మండలంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందాలంటే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బలపరిచిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సుధాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలంటూ ఓటర్లను కోరారు. మెలిపాకలో సచివాలయ కన్వీనర్ గుంట్ల అప్పారావు, వెంకటాపురంలో సర్పంచ్ తాతాజీ, ఎంపీటీసీ వీరునాయుడు తదితరులు సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. మేధావి వర్గానికి చెందిన సుధాకర్‌ను చట్టసభకు పంపడం ద్వారా మన సమస్యలు పరిష్కారం కావడంతో పాటు ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని అప్పారావు పేర్కొన్నారు. మొదటి ప్రాధాన్యత ఓటును సుధాకర్‌కు వేయాలని కోరారు.

రాంబిల్లి : ఎమ్మెల్సీగా సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మామిడివాడ తదితర గ్రామాల్లో ఎంపీపీ శిరీషశ్రీనుబాబు, జడ్పీటీసీ ధూళి నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్, మండల సచివాలయ కన్వీనర్ కొవిరి రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు నెట్టెం సత్యనారాయణ, ఎస్. సన్యాసిరావు, కె.నాగరాజు తదితరులు ప్రచారం నిర్వహించి సుధాకర్‌ను గెలిపించాలని కోరారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి

మునగపాక : ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసినట్టు నోడల్ అధికారి పి.ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం విలేకరులకు తెలిపారు. ఈ నెల 13న మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్లోని 196 పోలింగ్ కేంద్రాన్ని ఎమ్మెల్సీ ఎన్నికకు కేటాయించామన్నారు.

ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నిక జరుగుతుందన్నారు. మొత్తం 1239 మంది ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. వారిలో 802 మంది పురుషులు, 437మంది మహిళలు ఉన్నారు. పోలింగ్ కేంద్రం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు మధ్య ఎన్నిక ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఓటర్లు సకాలంలో పోలింగ్ కేంద్రానికి వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రభాకర్ కోరుతున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

అచ్యుతాపురం(అనకాపల్లి): ఈ నెల 13న నిర్వహించనున్న ఎమ్మెల్సీ ఎన్నికల నిమిత్తం అచ్యుతాపురం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 197,198 పోలింగ్ కేంద్రాలను అధికారులను శనివారం పరిశీలించారు. జోనల్ ఆఫీసర్ ప్రభాకర్‌రావు, రూట్ ఆఫీసర్ ఎర్రపాత్రుడు, ఎంపీడీవో, తహశీల్దార్‌లు పరిశీలించి ఏర్పాట్లపై ఆరా తీశారు.

జోరుగా ఎన్నికల ప్రచారం

నక్కపల్లి : పోలింగ్ తేదీ సమీపిస్తుండడం, ప్రచారం గడువు ముగుస్తుండడంతో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ప్రచారం జోరందుకుంది. శనివారం మండలంలో ఉపమాక, జగన్నాథపురం, చినదొడ్డిగల్లులో కాపు కార్పొరేషన్ డైరక్టర్ విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, పట్టభద్రులు, సచివాలయ సిబ్బందిని వైఎస్సార్‌సీపీ బలపరచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పొడగట్ల పాపారావు, వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, ఎంపీటీసీ తోట సత్తిబాబు, సర్పంచ్ ఆనందరావు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటర్లు 5088 మంది



ఎమ్మెల్సీ ఓటింగ్ జరిగే ప్రభుత్వ ఉన్నత పాఠశాల

నక్కపల్లి : పాయకరావుపేట నియోజకవర్గంలో పట్టభద్రుల ఓటర్ల సంఖ్య 5008 మంది అని నక్కపల్లి తహసీల్దార్ నీరజ తెలిపారు. పాయకరావుపేట మండలంలో 1667, కోటవురట్ల మండలంలో1092, నక్కపల్లి మండలంలో1118, ఎస్.రాయవరం మండలంలో 1131 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వీరంతా ఈ నెల 13న తమ ఓటువినియోగించుకోనున్నారని తెలిపారు.

మండలంలో 1667 మంది

పాయకరావుపేట : ఈ నెల 13 న (సోమవారం) జరగబోయే ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు మండలంలో 1667 మంది ఓటర్లు, ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మండలంలో గల 24 గ్రామాల పరిధిలోను 1667 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదైనారు. వీరిలో 1169 మంది పురుషులు, 497 మంది మహిళలు ఉన్నారు. పట్టణంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో 186, 187 పోలింగ్ బూత్‌ల్లో ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

ఉపమాక వెంకన్నను దర్శించుకున్న భక్తులు



స్వామి దర్శనానికి వచ్చిన భక్తులు

నక్కపల్లి : కల్యాణోత్సవాలు, రెండో శనివారం సెలవు దినం కావడంతో ఉపమాక వెంకన్న ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం స్వామివారి మూలవిరాట్‌ను స్వామివారి ఉత్సవమూర్తులను క్షేత్రపాలకుడు వేణుగోపాల స్వామిని దర్శించుకున్నారు.

మూలవిరాట్‌ను మెట్లమార్గం గుండా దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు రావడంతో రద్దీ ఏర్పడింది. బేడా మండపం, ఆస్థాన మండపం, ధ్వజస్తంభం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్యూలైన్లలో వేచి ఉంటూ స్వామి దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా యాత్రికులు తిరునాళ్లలో సుగంధ ద్రవ్యాలు, స్టీలు, ఇత్తడి పాత్రలు కొనుగోళ్లు జరిపారు.

ఉత్సాహంగా కేజీబీవీ వార్షికోత్సవం



మాట్లాడుతున్న ఎంఈవో అప్పారావు

కోటవురట్ల: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. బాలికల నృత్యాలు కనువిందు చేశాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈవో పి.అప్పారావు మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాలలో ఉన్నత ఫలితాలు సాధిస్తున్నారన్నారు. పట్టుదలతో చదివి మంచి జీవితాలను పొందాలన్నారు. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో సరితాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు తల్లిదండ్రుల తోడ్పాటు అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు శాంతి ప్రసూన

ఎస్.రాయవరం : పది పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు తల్లిదండ్రులు సహకారం అందివ్వాలని దార్లపూడి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాంతి ప్రసూన అన్నారు. పాఠశాలలో శనివారం 10 వ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రధానోపాధ్యాయులు అత్యవసర సమావేశం నిర్వహించారు. పబ్లిక్ పరీక్షలకు ఎంతో సమయం లేదని, పాఠశాలలో చదివి ఇంటికి వచ్చే విద్యార్థులను టీవీకి దూరంగా ఉంచాలన్నారు. వీధుల్లో మైక్ సౌండ్ లేకుండా చూడాలన్నారు. పాఠశాలకు వచ్చి వెళ్లేటప్పుడు జాగ్రత్తలు చెప్పాలన్నారు.

నేడు జాతీయ మానవహక్కుల పరిరక్షణ సమితి శిక్షణ

అనకాపల్లిటౌన్: స్థానిక విజయారెసిడెన్సీలో ఆదివారం జాతీయ మానవహక్కుల పరిరక్షణ సమితి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు సంస్థ అనకాపల్లి పట్టణశాఖ కార్యదర్శి కోరిబిల్లి హరి శనివారం పేర్కొన్నారు. ఈ శిక్షణా కార్యక్రమానికి పరిరక్షణ సమితి చైర్మన్ టి.ఎన్. రామచంద్రనాయుడు, వైస్ చైర్మన్ మురళి హాజరవుతారని ఆయన తెలిపారు.

రేపు కవయిత్రి మొల్ల జయంతి

అనకాపల్లిటౌన్: ఉమ్మడి విశాఖజిల్లాలో కుమ్మరి శాలివాహన కవయిత్రి మొల్ల జయంతిని ఈనెల 13న ఘనంగా నిర్వహించనున్నామని జిల్లా కుమ్మరిశాలివాహన డైరెక్టర్ అర్జున వెంకటరావు శనివారం పేర్కొన్నారు. జిల్లాలో ప్రతి మండలంలో జయంతి వేడుకలు నిర్వహించాలని ఆయన సంఘ సభ్యులు పిలుపునిచ్చారు.

ఆనంద్‌కు చెంగల అభినందనలు



ఆనంద్‌ను అభినందిస్తున్న చెంగల

నక్కపల్లి: ఎంఎస్‌ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌ను పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకటరావు అభినందించారు. శనివారం ఆనంద్‌ను యలమంచిలిలో కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించినట్లు చెంగల తెలిపారు. పార్టీలో కష్టపడి పనిచేసేవారికి గుర్తింపు ఎల్లపుడూ ఉంటుందన్నారు. ఆడారి కుటుంబానికి సీఎం జగన్ మోహన్‌రెడ్డి సముచిత స్థానం కల్పించారన్నారు. డెయిరీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఆనంద్ పార్టీ అధినేత అప్పగించిన పదవికి న్యాయం చేస్తారన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

20న ఎఫ్‌ఎం బాబాయ్‌కు సత్కారం

మునగపాక: మునగపాకలో ఈ నెల 20న గ్రామీణ యువజన సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో రంగస్థల, సినీ నటుడు దాడి త్రినాథస్వామి (ఎఫ్‌ఎం బాబాయి)కు అభినందన సత్కారం జరుగుతుందని సంస్థ కన్వీనర్ సూరిశెట్టి రాము ఒక ప్రకటనలో తెలిపారు. నందీశ్వర కళా ప్రాంగణంలో రాత్రి 7 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.125 సినిమాల్లో నటించి, 500కు పైగా కామెడీ షోలు, 25కు పైగా షార్ట్‌ఫిల్మ్స్, 200కు పైగా రంగస్థల ప్రదర్శనలు, 164 పరిషత్తుల్లో పాల్గొని 162 ఉత్తమ పాత్రధారిగా ప్రతిభ చూపిన త్రినాథస్వామిని సత్కరిస్తామన్నారు. అలాగే డాక్టర్ పి.సతీష్‌కుమార్ దర్శకత్వం, నిర్వహణ, నిర్మాణంలో నిర్మితమైన తెలుగు చలన చిత్రం దహనంలో అద్భుత ప్రదర్శన ఇచ్చిన త్రినాథస్వామి సత్కార కార్యక్రమానికి కళాభిమానులు తరలి రావాలన్నారు. అదేరోజు రాత్రి హైదరాబాద్‌కు చెందిన భూమిక థియేటర్ గ్రూప్ వారిచే బరిబత్తుల రాజు నాటిక ప్రదర్శన జరుగుతుందన్నారు. రెండు కార్యక్రమాలను విజయవంతం చేయాలని రాము కోరారు.

నేడు వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాలు

అనకాపల్లిటౌన్ : స్థానిక రింగ్‌రోడ్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం పార్టీ ఆవిర్భావ దినోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు శనివారం పేర్కొన్నారు. ఈ వేడులకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు, రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ హాజరవుతారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు హాజరకావాలని ఆయన కోరారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవం

కశింకోట: మండలంలోని వెదురుపర్తి గ్రామంలో శనివారం రాత్రి గౌరీపరమేశ్వరుల ఉత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గౌరీపరమేశ్వరులను గ్రామంలో ఊరేగించారు. ప్రజలు దర్శించి పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు అమ్మవారిని దర్శించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ఆయనను దుశ్శాలువాతో సత్కరించింది. ఉత్సవాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

సీతంరాజుకు మద్దతుగా ఎమ్మెల్యే బాబూరావు ప్రచారం



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

ఎస్.రాయవరం : వెంకటాపురం గ్రామంలో శనివారం ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను, ఉపాధ్యాయులను కలసి సీతంరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. మరికొద్ది సమయంలో పెళ్లి చేసుకుని నూతన జీవితం ప్రారంభించబోయే వధూవరులను కలిసి ఆశీర్వదించిన బాబూరావు వారిని ఓటు అభ్యర్థించారు. పెట్టుగోళ్లపల్లి, చినగుమ్ములూరు గ్రామాల్లో ఎంపీపీ కోనలోవలక్ష్మి, జెడ్పీటీసీ కాకర దేవి, సర్పంచ్‌లు కర్రి సత్యనారాయణ, ధూళి శ్రీనుబాబు, భూపతి అప్పారావు, కొప్పిశెట్టి సత్యం, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొణతాల శ్రీనివాసరావు, మహాత్మాగాంధీ జ్యోతిబా పూలే చైర్మన్ వాసు, వైఎస్సార్‌సీపీ నాయకులు విస్తృతంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయులను, పలువురు పట్టభద్రులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు సీతంరాజు సుధాకర్‌కు వేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బోడిపల్లి అప్పన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటరాజు, గరగా శ్రీను, దారబోయిన రాము, సమ్మింగి శ్రీనివాసరావు, బాబి పాల్గొన్నారు.

పట్టభద్రులంతా ఓటు హక్కు వినియోగించుకోవాలి

నక్కపల్లి : పట్టభద్రులంతా ఈనెల 13వ తేదీన ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు కోరారు. శనివారం ఉపమాక నక్కపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా సీతంరాజు సుధాకర్‌ను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బలపరిచారన్నారు. స్థానిక సమస్యలపై మంచి అవగాహన ఉన్న సుధాకర్‌కు మొదటి ప్రాదాన్యత ఓటు వేసి ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. సచివాలయ ఉద్యోగ నియామకాల ద్వారా రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య కొంతవరకు పరిష్కరించిన ఘనత జగన్‌దేనన్నారు.

త్వరలో రాష్ట్రంలో 13 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయని, పలు కార్పొరేట్ సంస్థలు ఏర్పాటు కాబోతున్నాయన్నారు. లక్షలాది మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. ఇది చేతల ప్రభుత్వమన్నారు. సుధాకర్‌ను గెలిపించి సమస్యల పరిష్కారానికి అభివృద్ధికి సహకరించాలన్నారు. నాయకులు నర్సింహమూర్తి, గొర్ల బాబూరావు, తాతారావు, శేషారత్నం పాల్గొన్నారు.

14న గంగ పరదేశమ్మ పండగ



గంగ పరదేశమ్మ అమ్మవారి పండుగ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి

మునగపాక : మండలంలోని గవర్ల అనకాపల్లిలో ఈ నెల 14న గంగ పరదేశమ్మ అమ్మవారి పండగను ఘనంగా జరుపుకోవాలని అనకాపల్లి ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి కోరారు. శనివారం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత పండగలను సమష్టిగా జరుపుకోవాలన్నారు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలన్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు, ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత షేక్ ఇస్మాయిల్, ఉత్సవ కమిటీ చైర్మన్ మళ్ల ఈశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నేత శేషు, వార్డు సభ్యులు పాల్గొన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ కూడా పండగ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

'మహిళా ఉద్యోగుల భద్రతకు అధిక ప్రాధాన్యం'



బస్సులో మహిళా ఉద్యోగులతో మాట్లాడుతున్న దొరైస్వామి

అచ్యుతాపురం(అనకాపల్లి) : బ్రాండిక్స్ సంస్థలో పనిచేసే మహిళా ఉద్యోగులు వారి గమ్యస్థానాలను చేరుకునే వరకూ భద్రత, వసతులు కల్పిస్తామని బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి అన్నారు. శుక్రవారం రాత్రి షిఫ్ట్‌లో విధులు ముగించుకొని ఇళ్లకు వెళుతున్న మహిళా ఉద్యోగుల సాధకబాధకాలు తెలుసుకునేందుకు ఆయన బస్సులో ప్రయాణించారు. ఈ సందర్భంగా మహిళా కార్మికులు, బస్సు డ్రైవర్లతో మాట్లాడి వారికి ఎదురయ్యే ఇబ్బందులను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. తమ సంస్థలోని ప్రతి ఉద్యోగికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడానికి ముందుంటామని అన్నారు.

చిన గుమ్ములూరులో ఫ్యామిలీ డాక్టర్ సేవలు



చినగుమ్ములూరులో ఇంటివద్దకు వెళ్లి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి రామ్‌నాయక్

ఎస్.రాయవరం : ఫ్యామిలీ డాక్టర్ వైద్యంతో రోగులకు మరింత సౌకర్యవంతమైన వైద్యం అందుతోందని పెనుగొల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి రామనాయక్ అన్నారు. చినగుమ్ములూరు గ్రామంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు అందించారు. గ్రామంలో 104 వాహనం సామాగ్రితో వైద్య శిబిరం నిర్వహించారు. ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం గ్రామంలో ఇంటి వద్ద మంచానికే పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేశారు. శిబిరంలో జెడ్పీటీసీ కాకర దేవి తదితరులు పాల్గొని వైద్య సిబ్బందికి సహకారం అందించారు.

శ్రీరాముని కల్యాణానికి పెళ్లిరాట



శ్రీరాముని పెండ్లి రాట వేసిన భక్తులు

పాయకరావుపేట : ఈ నెల 30 వ తేదీన శ్రీ సీతారాముల కల్యాణం (శ్రీరామనవమి) సందర్భంగా పట్టణంలో గల శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో పెళ్లిరాట వేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, వానరసేన బృందం శ్రీరాముని కల్యాణానికి శనివారం ఉదయం పెళ్లిరాట వేసి శ్రీరామ నవమి కార్యక్రమాలు ప్రారంభానికి శ్రీకారం చుట్టారు. ఆలయ అర్చకులు వేదమంత్రాలతో పెళ్లి రాటను వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వానరసేన సభ్యులు మామిడి వెంకటేశ్వరరావు, జగతా శ్రీను, కొశిరెడ్డి నాగసూరి,కొశిరెడ్డి నర్సింహమూర్తి, కనకరాజు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్లకోమా కంటి వైద్య శిబిరాలు



గ్లకోమా పరీక్షలు చేస్తున్న వైద్యులు (ఫైల్)

తుమ్మపాల : గ్లకోమా వ్యాధి నివారణకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక కంటి పరీక్ష శిబిరాలు నిర్వహిస్తున్నట్టు డాక్టర్ జి.వి.రమణ తెలిపారు. అంధత్వ నివారణ సంస్థ చైర్మన్, కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి ఆదేశాల మేరకు ఈ నెల 12 నుంచి 18 వరకు గ్లకోమా వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. 45 ఏళ్ల వయసు నుంచి రక్తపోటు, మధుమేహం ఉన్నవారు, వయోవృద్ధులు తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలన్నారు. గ్లకోమా వ్యాధి నివారణ కేంద్రాలు, జిల్లాలో అన్ని ఆస్పత్రుల్లో వైద్యపరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలు ద్వారా శాశ్వత అంధత్వం రాకుండా నివారించే అవకాశం ఉందన్నారు. పారా మెడికల్, ఆఫ్తాల్మిక్ అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, కంటి ఆస్పత్రుల వారితో కూడా అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు.